

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

హరీ హరీ వసుంధరా పె నీలా నీలా యె గగన్
కె జిస్ పె బాదలోంకి పాల్‌కీ ఉడా రహా పవన్

కవులకూ మాములు మనుషులకూ తేడా ఒకటే. కళాకారులూ, మామూలు మనుషులూ అదే ప్రపంచాన్ని చూస్తారు. అవే అనుభూతులు పొందుతారు. కానీ, ఇద్దరూ చూసేది ఒకటే అయినా వాటిని వారు చూసే దృష్టివేరు. వాటిలో వారు దర్శించేది వేరు.

నీలి ఆకాశాన్ని అందరూ చూస్తారు. పచ్చటి చెట్లతో నిండిన మైదానాలనూ అందరూ చూస్తారు. ఆకాశంలో కదలాడే మేఘాలనూ చూస్తారు. వీచేగాలిని అనుభవిస్తారు. కానీ వీటన్నింటినీ ముడిపెట్టి, వాటి నడుమ సంబంధాన్ని ఊహించి దర్శించటం కేవలం కళాకారుడికే సాధ్యమవుతుంది. అందుకే నీలి గగనంలో తేలుతూ ప్రయాణించే మేఘాలను చూసి సామాన్యుడు 'ఎంత అద్భుతంగా ఉంది!' అని మురిసిపోతే, కవి, నీలిగగనంపై గాలి, ఎవరి మేఘాల పల్లకీని మోస్తోంది?' అని ఆశ్చర్యపోతున్నాడు ఆనందంగా, ఆశ్చర్యంతో!

ఇక్కడే 'కవిత' గొప్పతనం స్పష్టమవుతుంది. చిత్రకారుడు దృశ్యాన్ని చిత్రిస్తాడు. ఆ చిత్ర దర్శనం ద్వారా సామాన్యులకు ఆనందం కలుగుతుంది. అందం స్పృహ తెలుస్తుంది. అతి తక్కువమంది ఆ దృశ్యాలలో కళాకారుడు ఇమిడ్చి ప్రదర్శించిన అంతరంగాన్ని గ్రహించగలుగుతారు. కానీ కవిత అక్షరాల ద్వారా దృశ్యాలను సృజిస్తుంది. అవే అక్షరాలతో పాఠకుడికి 'దృష్టి'ని ఇస్తుంది. ఊహాత్మక శక్తికి లెక్కలనిస్తుంది. ఎలాగంటే, నీలి ఆకాశంలో తేలే మేఘాలు, 'కవిత'ను అనుభవించినప్పటి నుంచీ గాలి మోస్తున్న 'పల్లకి'లా తోస్తాయి. పచ్చటి చెట్లతో అలరారే వసుంధరను కలిపిన నీలి ఆకాశంపైన గాలి ఎవరి పల్లకి మోస్తోంది? ఎవరి పల్లకిని నడుపుతోంది? అత్యద్భుతమైన ఊహ! అత్యంత అందమైన ఆలోచన! ఎంతో లోతైన సందేహం! ఇంతటితో ఆగితే కవి సామాన్యమైన కవి. ప్రతిభావంతుడయిన కవి అంతటితో ఆగడు.

దిశాయెన్ దెఖో రంగ్ భరీ, చమక్ రహీ ఉమంగ్ భరీ
యె కిస్ నె ఫూల్ ఫూల్ పె కియా సింగార్ హై
యె కౌన్ చిత్రకార్ హై, యె కౌన్ చిత్రకార్
యె కౌన్ చిత్రకార్ హై.. ..

దిక్కులన్నీ అందమైన రంగులతో అలరారుతున్నాయి. అత్యుత్తమమైన ఉత్సాహంతో తొణికిసిలాడుతూ తళతళలాడుతున్నాయి. అయితే, ఈ ప్రతిపూవునూ ఇంత అందంగా అలంకరించినవాడెవడు? ఎవరీ చిత్రకారుడు?

ఇక్కడే గాలి 'ఎవరి పల్లకీ మోస్తోంది?'అన్న ప్రశ్నకు సమాధానం వస్తుంది. 'ఎవరీ చిత్రకారుడు? ' అన్న ప్రశ్నకు సమాధానం ప్రకృతి ఇస్తుంది. మనిషి మనస్సు ఇస్తుంది.

కవి తన అక్షరాలతో ఎంత అద్భుతమైఅన ప్రకృతి చిత్రాన్ని గీస్తున్నాడో!

'దిశాయెన్ దెఖో రంగ్ భరీ' అన్న ఒక్క మాటతో ప్రకృతి విరాట్ స్వరూపాన్ని కళ్లముందు నిలుపుతున్నాడు. ఓ వైపు కొండలు, మరో వైపు లోయలు, ఇంకో వైపు ఉరుకులు పరుగుల మీద ప్రవహించినదీ, ఓ వైపు సూర్యుడి వెలుతురుతో తళతళలాడే ప్రకృతి, మరోవైపు సూర్యుడి వెలుతురుకు అడ్డుపడ్డ కొండలు నీలికాంతితో ఉంటే, మరోవైపు పచ్చటి చెట్లు కొండను కప్పి ఎండ వెలుతురులో కళకళలాడుతూంటాయి. ఇంకోవైపు నీరెండ గోధుమ రంగులో ప్రకృతిని ముంచి ఎత్తుతూంటే, మరోవైపు 'నీడ'లో నీలి, నలుపుల మిశ్రమ రంగులో నిస్తబ్దంగా తోస్తుంది ప్రకృతి. అంతలో కవి దృష్టి పూలపై పడింది. ఎన్ని పూలు! ఎన్ని రంగులు! ఎన్నెన్ని రంగుల మిశ్రమాలు!

ఎంతో రసికుడు దేవుడు.
ఎన్నిపూవులు, ఎన్నిరంగులు ఎన్ని సొగసులిచ్చాడు.
అన్నిటిలో నిన్నే చూడమన్నాడు!

అసలు సిసలైన అందం వ్యక్తిలో ఆధ్యాత్మకతను రగిలిస్తుంది వ్యక్తిలో భగవద్భావనను చైతన్యవంతం చేస్తుంది అసలైన అందం వ్యక్తిలో భగవదారాధనా బీజానికి నీరుపోసి, విరాట్ ప్రకృతి ముందు పిపిలీకంలాంటి వాడయినా ఆ ప్రకృతి అందాన్ని దర్శించి, అనుభవించి, పరవశించి, పలవరించి, ప్రతిసృష్టి చేయగల ఏకైక ప్రాణి అయిన తన గొప్పతనం తెలుస్తుంది. తన బాధ్యత గ్రహింపుకు వస్తుంది. మామూలు మనిషిలో సున్నితత్వ స్రవంతీ ప్రవాహం పరవళ్లు తొక్కుతుంది. మాములు మనిషి మానవత్వం మేల్కొన్న మనిషి అవుతాడు. ప్రకృతి మనిషిపై చూపే ప్రభావం ఇది. అంత తప్ప అందాన్ని చూసి మృగం అయ్యే మనిషికి అందం అంటే తెలియదు. అలాంటివాడిని మనిషిలా పరిగణించటం కూడా 'మనిషి'కి అవమానం. ఎందుకంటే ప్రకృతికి ప్రతీక స్త్రీ. సమస్త ప్రకృతి విరాట్ స్వరూపాన్ని స్త్రీలో దర్శించారు కవులు. అయితే స్త్రీని చూసే దృష్టిని బట్టి ప్రకృతి కనబడే రీతి ఆధారపడి ఉంటుంది. స్త్రీ, అందంలో రసికతను ఓ కవి దర్శిస్తున్నాడు అంటే పరోక్షంగా ప్రకృతి సృజనలోని భగవంతుడి రసికతను స్త్రీలో ఆరోపించి దర్శిస్తూ భగవంతుడికి తన రసికతను ఆపాదిస్తున్నాడన్నమాట కవి.

ఇందుకు భిన్నంగా 'బూంద్ జో బన్ గయీ మోతీ' సినిమాలో కవి 'భరత్ వ్యాస్' ప్రకృతి సృజనలో భగవంతుడి సృజనాత్మక ప్రతిభను దర్శిస్తూ, 'ఇదంతా ఎవరి సృష్టి? ఈ చమత్కారం ఎవరిది? ' 'సృజన చేసిన చేసిన చిత్రకారుడు ఎవరు? ' అన్న ప్రశ్నతో నిగూఢంగా సమాధానం ఇస్తున్నాడన్నమాట. ఇక్కడ గమనించవలసిందేమిటంటే 'బూంద్ జో బన్ గయీ మోతీ'లో విద్యార్థులకు ఉపాధ్యాయుడు పాఠం చెప్పే సందర్భంలో రాసిన పాట ఇది. ఇలాంటి సందర్భంలో స్త్రీలో ప్రకృతిని ఆరోపించి కవిత రాయటం అసందర్భం, అనౌచిత్యం. అలాగే, 'రాజారమేష్ ' సినిమాలో ప్రేయసిని చూసి ప్రియుడు, ముఖ్యంగా అతడు 'రసికుడు' అయి ఉంటే తన ప్రేయసిలో ప్రకృతిని దర్శించి ఆధ్యాత్మక భావన పొందటం రసాభాస అవుతుంది. అంటే, సందర్భానికి తగ్గట్టు కవులు పాత్రలు తామే అయి పాత్రలకు తమ వ్యక్తిత్వాన్ని ఆపాదించి, అత్యద్భుతమైన భావనలను, ఆలోచనలను అత్యంత సృజనాత్మకమైన రీతిలో, అతి సరళంగా సమాజానికి అందించారన్నమాట.

జాగో ఉజియరా ఛాయే, మన్‌కా అంధేరా జాయే
కిరణోం కీ రాణీ గాయే,
జాగో హే, మేరే మన్ మోహన్ ప్యారే

**జాగో హే , మేరే మన్  మోహన్  ప్యారే**

**జాగో మోహన్ ప్యారే   ,  జాగో**

**నవ్ యుగ్ చూమే  నైన్ తిహారే, జాగో**

ఏదైనా చూసే వ్యక్తి దృష్టి, సంస్కారంపై ఆధారపడి ఉంటుంది. కానీ ఆ వెలుతురునిచ్చేది భగవంతుడు సూర్యుడు. అంతరిక్షంలో కొన్ని మిలియన్ మైళ్ళు ప్రయాణించి భూమిపై చేరిన సూర్యకిరణాల శక్తిని వృక్షాలు 'శక్తి'గా మలచి జీవులకు  అందిస్తాయి. అలాంటి సూర్య కిరణాలు మనిషికి బుద్ధినిచ్చి జ్ఞాన చక్షువును,  దృష్టినిస్తాయన్న భావాన్ని 'జాగ్తేరహో' సినిమాలోని పాటలో కవి శైలేంద్ర అత్యంత లలితంగా, సరళంగా, సుందరంగా ప్రదర్శించాడు.

జగతి వెలుగుతో నిండింది. మనస్సులోని చీకటి పారిపోయింది. కిరణాల రాణి పాడుతోంది. నిదురలే కృష్ణా.... నవయుగం నీ నయనాలను స్పృశిస్తోంది.  నిదురలెమ్మంటోంది కవిత. చీకటి అజ్ఞానం. వెలుతురు విజ్ఞానం. చీకటి ఉన్న చోట వెలుగు ఉండదు. వెలుగు ఉన్న స్థలంలో చీకటి ఉండదు. జగతి వెలుగుతో నిండిందనగానే మనిషి హృదయంలోని చీకటి పారిపోవటం ఎంతో గొప్ప తాత్విక భావన.

సినిమాలో ఈ పాట చివరిలో వస్తుంది. సినిమా అంతా నాయకుడు దాహంతో నీటికోసం తపిస్తూ, మనుషుల అసలు స్వరూపాలను దర్శిస్తాడు. చివరికి, తెల్లవారుతూండగా తోటలోకి వస్తాడు. ఓ అమ్మాయి చెట్లకు నీళ్ళు పోస్తూ, ఉదయం గురించి పాడుతూంటుంది. అత్యద్భుతమైన సన్నివేశం. అంతే గొప్ప భావంతో సందర్భోచితంగా ఉంటుంది గేయం.

**భిగీ భిగీ అఖియో సే  ముస్ కాయే**

**యే  నయీ  భోర్ తోహే  అంగ్ లగాయే –**

**బాహే   ఫైలావో  దుఖియారో,**

**నవ్ యుగ్ చూమే నైన్ తిహారే.**

చెమ్మగిల్లిన నయనాలతో చిరునవ్వులొలుకుతూ నూతనోదయం దగ్గర తీసుకుంటోంది. దుఃఖితులంతా చేతులు సాచండి. నవయుగం మీ నయనాలను స్పృశిస్తోంది. 'చెమ్మగిల్లిన నయనాలు ' అనేకన్నా 'దయార్ద్ర నయనాలు' అనటం సబబుగా ఉంటుంది. కానీ ఉదయంపూట తుషార బిందువులతో తడిసిన ప్రకృతి చెమ్మగిల్లిన నయనాలతో సాదరంగా మందహాసం చేస్తూ దుఃఖితుల దుఃఖాన్ని తీర్చి సాంత్వననిచ్చేందుకు నవయుగానికి స్వాగతం పలుకుతోందన్న భావనను కవి అత్యద్భుతంగా కళ్లముందు నిలిపాడు. హృదయంలో నిలిపాడు.

**జిసనె మన్  కా దీప్ జలాయే,**

**దునియా కో  ఉస్నే  హీ  ఉజ్లా  పాయే**

**మత్ రహనా అఖియోంకె సహారే**

అత్యద్భుతం! వేదాంత సారాన్ని మూడు పాదాల్లో వామనుడు మూడు అడుగులతో ప్రపంచాన్ని నింపినట్టు, ప్రదర్శించాడు శైలేంద్ర. ఎవరి హృదయంలో దీపం వెలుగుతూ ఉంటుందో, వారే ప్రపంచంలో వెలుగును గ్రహిస్తారు. ప్రకృతిలో భగవంతుడు ఒకరికి కనిపిస్తే, ప్రేయసిలో ప్రకృతి కనబడి భగవంతుడి రసికత మరొకరికి బోధపడుతుంది. ప్రపంచమంతా మనసు ఏది చూపితే దాన్నే చూస్తుంది. అక్కడ ఉన్నది ఎవరూ చూడలేరు. తామేది చూడాలని అనుకుంటున్నారో దాన్నే చూస్తారు. కాబట్టి ప్రపంచంలో వెలుతురును చూడాలంటే ముందుగా మనస్సులోని దీపాన్ని వెలిగించాలి. శైలేంద్ర మరో పాటలో 'అంధేరాహై మన్ కా దియాతో జలాలే' అంటాడు. 'చీకటిగా ఉంది మనస్సులోని దీపాన్ని వెలిగించమని అర్థం. మనసు నిండా చీకటి, నిరాశ, క్రోధం, ద్వేషం, కుళ్ళు, కసి నిండిన వాడికి ప్రపంచం అలానే కనిపిస్తుంది. అదంతా అజ్ఞానం. ఆ అజ్ఞానాన్ని తొలగించి చూస్తే ప్రపంచం అందంగా, ఆనందంగా కనిపిస్తుంది. అందుకే 'కంటిని నమ్మవద్దంటున్నాడు'

కవి. కన్ను చూపినదాన్ని మాత్రమే నమ్మేవాడు నిజం తెలుసుకోలేడు. ఎందుకంటే కన్ను పరిమిత పరిధి కలది. పైగా కన్నులో ఏయే దోషాలున్నాయో ఎవరికీ తెలియదు. కాబట్టి కన్ను చూపించిందే నిజమని నమ్మేవాడిని మించిన మూర్ఖుడు, అజ్ఞాని మరొకరు ఉండరు. వేదాంతం ఇదే చెప్తుంది. ఇంద్రియాలు లోపభూయిష్టము, దోషభూయిష్టము. ఇంద్రియ జ్ఞానం అసంపూర్ణం. అనృతం కాబట్టి వ్యక్తి ఇంద్రియాల పరిధిని అధిగమించి దర్శించగలిగినప్పుడే అసలు నిజాన్ని గ్రహించగలుగుతాడు. కాబట్టి ఇంద్రియాల ప్రలోభంలో పడకుండా, మనస్సులో దీపం వెలిగించిననాడే అసలు సూర్యోదయం అన్నమాట. దీన్ని ఆరంభంలోని 'జాగ్ ఉజియారా ఛాయే' తో అన్వయించుకుంటే కవి గొప్పతనం ప్రస్ఫుటం అవుతుంది. ఎలాంటి వర్ణనలు, ఉపమానాలు లేకుండా అత్యద్భుతమైన తాత్విక సత్యాన్ని ప్రజల ముందుంచాడు కవి. వారు ఎలా స్వీకరిస్తారో అది వారి బుద్ధిని అనుసరించి ఉంటుంది. కవి తాను చేయాల్సిన పని చేసేశాడు.

**కిరణ్ పరీ గగరీ ఛల్‌కాయే,**
**జ్యోత్ కా ప్యాసా ప్యాస్ బుఝాయే**
**ఫూల్ బనే మన్ కె అంగారే**

కిరణాల దేవదూత, కిరణాల కుండను వొంపింది. దాంతో దాహార్తులు దాహాన్ని తీర్చుకున్నారు. వారి మనస్సుల్లోని నిప్పు కణికలు పూవులయ్యాయి. దాహం తీర్చుకోవటం కోసం ఆరంభమైన నాయకుడి ప్రయాణం మనుషులలోని నైచ్యాన్ని దర్శించి తల్లడిల్లుతుంది. ఇక్కడ ఈ తోటలో అతడి దాహం తీరుతుంది. ఆ రాత్రి అతడు ఎంతో విజ్ఞానాన్ని గ్రహించాడు. ఈ సందర్భంలో ఇంత తాత్వికతను చిలికించాడు శైలేంద్ర. అయితే సినిమాలో ఈ పాటలో తోటకి నీళ్లు పోసేది నర్గీస్. దాహం తీర్చుకునేది రాజ్‌కపూర్. దాంతో పాటను చూడగానే ప్రేక్షకులు 'రాజ్‌కపూర్ దాహాన్ని నర్గీస్ మాత్రమే తీర్చగలద'ని వ్యాఖ్యానించారు. దాంతో పాట ప్రభావం దృశ్యపరంగా దెబ్బతిన్నది. దృష్టిని బట్టి దృశ్యం కదా! ఇది నర్గీస్ రాజ్‌కపూర్‌లు తెరపై కలసి కనిపించిన చివరి దృశ్యం.

ఒక ఉషోదయం పాటలో అత్యద్భుతమైన భావాన్ని ఇమిడ్చాడు శైలేంద్ర. 'దృష్టిని బట్టి ప్రపంచం ' అన్న సత్యాన్ని ప్రదర్శించాడు. కనబడినవన్నీ నిజాలు కావు అన్నాడు. మనస్సులోని చీకటిని తరిమితేనే ప్రపంచం వెలుగుమయం అవుతుందన్నాడు. దృష్టిని బట్టి ప్రకృతి, ప్రపంచం' అని హరీ హరీ వసుంధర, ఎంతో రసికుడు దేవుడు' పాటలూ నిరూపిస్తాయి.

**తపస్వి యోంసె హై అటల్ యె పర్వతోంకి చోటియా**
**యె సర్ప సీ ఘుమేర్దార్, ఘేర్దార్ ఘాటియా**
**ధ్వజా సె యే ఖడేహువే హై వృక్ష్ దేవ్‌దార్‌కి**
**బగీచె యే గులాబ్‌కీ, బగీచె యే బహార్ కీ**
**యె కిస్ కవీ కి కల్పనా కా చమత్కార్ హై**

నిశ్చలమైన పర్వతాలు మునులు తపస్సులో ఉన్నట్టు తాపసుల్లాఉన్నాయి. పాము మెలికలు తిరిగినట్టు మెలికలు తిరిగే కొండదారులు, ధ్వజంలా నిలచి ఉన్న దేవదారు వృక్షాలు, గులాబీతోటలు, వసంతంతో విరగబూసిన తోటలు ఇదంతా ఏకవి కల్పన? ఏ కవి కల్పనా చమత్కారం?

అద్భుతమైన రీతిలో భావాన్ని ప్రతిపాదిస్తున్నాడు కవి. 'catch them young' అంటారు. అలా విజ్ఞానార్జన ఆరంభమయిన తొలిదశలోనే విద్యార్థులకు ప్రకృతిని దర్శించటం, దర్శించి అనుభవించి పలకరించటం, ప్రకృతిలోని సృజనాత్మకత ద్వారా ద్యోతకమవుతున్న భగవంతుడి సృజనాత్మక శక్తిని దర్శించి ఆనందాశ్చర్యాలను అనుభవిస్తూ, ఆలోచించటం నేర్పటం ఎంత అద్భుతంగా ఉంటుంది! నాలుగు

గోడల మధ్య టీవీ, కంప్యూటర్లు చూడటమే పర్యటన, అరుపులు, కేకలే ఎంజాయ్‌మెంట్ అనుకునే వారిని చూస్తూంటే ఇలాంటి పాఠశాల, ఇలాంటి అధ్యాపకుడు, ఇలాంటి పాట 'అవసరం' బోధపడుతుంది. ఎందుకని సమాజాల్లో మనుషులు కాక మృగాలు సంచరిస్తున్నాయో తెలుస్తుంది.

పువ్వులన్నీ ఏరి నీ బొమ్మ చేసినాడు
రంగులన్ని రంగరించి పూతపూసినాడు
ఘుమఘుమలు గుమ్మరించి శ్వాస నింపినాడు
నీ శ్వాస నింపినాడు
నీ పెదవులలో పూదేనియ పొదిగి తీర్చినాడు.

అందమైన ఊహ. పువ్వులతో బొమ్మ చేయటం, రంగులతో పూత పూయటం, ఘుమఘుమలతో శ్వాస నింపటం, పెదవులలో పూదేనియ పొదగటం... ఒకరకంగా చూస్తే దేవదారు వృక్షాలను ధ్వజాల్లాగా, పర్వతాలను తపస్సుల్లాగా దర్శించిన కవి ఎంతటి సృజనాత్మక శీలియో, ఎంతటి భావావేశపరుడో, ఎంతటి సున్నిత మనస్కుడో, ఎంతటి ఉన్మత్తుడో, ప్రేయసి పెదవులలో పూదేనియలు దర్శించిన కవి అంతే సున్నిత మనస్కుడు, సృజనశీలి, భావావేశపరుడు. తేడా అల్లా దృష్టి మాత్రమే. ఒక కవి మనిషిలో ఆకాశాన్ని చూస్తూంటే, మరో కవి ఆకాశంలో మనిషిని చూస్తున్నాడు.

కుదరత్‌కి ఇస్ పవిత్రతా కొ తుం నిహార్ లో
ఇన్ కే గుణోంకొ అప్నే మన్‌మె తుం ఉతార్‌లో
చంకాలో ఆజ్ లాలిమా, అప్‌నీ లలాట్‌పే
కణ్ కణ్ సె ఝూన్‌క్తీ తుంహె, ఛబీ విరాట్‌కె
అప్‌నీ తొ ఆంఖ్ ఏక్ హై, ఉస్ కీ హజార్ హై
యె కౌన్ చిత్రకార్ హై.. ..

భరత్ వ్యాస్ గేయాల్లో పదాలు పవిత్రంగా ఉంటాయి. అప్పుడే విరిసిన పూరేకుల్లా మృదుమధురంగా ఉంటాయి. ఉషోదయం నాటి తుషార బిందువుల్లా తళతళలాడతాయి. ప్రకృతిలోని పవిత్రతను ఆకళింపు చేసుకోమంటున్నాడు. ప్రకృతిలోని స్వచ్ఛతకు, పవిత్రత వంటి గుణాలను మనస్సులో నింపుకోమంటున్నాడు. లలాటం పై ఎర్రటి బొట్టును మెరిపించమన్నాడు. ప్రతీక సులభంగా అర్థమవుతుంది. కణకణం నుండీ విరాట్ పురుషుడి అంశ తొంగి చూస్తోంది. మనకు ఒకే కన్ను. అతనికి వేల కన్నులు – అంటున్నాడు కవి. పిల్లలకిలా ప్రకృతి కణకణంలో విరాట్ పురుషుడిని దర్శించటం ఎంత గొప్పగా, అద్భుతంగా ఉంటుంది.

నల్లని కురులలోకి మల్లెపూలు సొగసు
పసిడి రంగు ప్రియురాలికి గులాబీలు మెరుగు
ముద్దులొలుకు మోముకూ ముద్దబంతి పొందికా
మొత్తంగా ఏ పువ్వూ నీకు సాటి రాదిక!

ఇక్కడ నాయకుడి దృష్టికి నాయకనే ప్రపంచం ఆమెకు ఏదీ సాటిరాదు. అక్కడ అణువణువునుండీ విరాట్ పురుషుడి ఆకృతి తొంగి చూస్తోంది. ఇక్కడ అనంతమైన విరాట్ స్వరూపం ఒక వ్యక్తిలో ఒదిగింది అంతా దృష్టి. ప్రపంచమంతా మనసు చేసే మాయ. కానీ ఆ

మాయపొరలను తొలగించి అసలు సత్యాన్ని క్షణకాలమైనా గ్రహించేట్టు చేస్తుంది ఉత్తమకళ. అలాంటి కళ సృజన వల్ల కళాకారుడు, కళ, దాన్ని అనుభవించే సామాన్యుడూ ఉత్తములుగా ఎదుగుతారు.

నిజానికి ప్రకృతిని చూసి పరవశించే గీతాలలో మన సినీ కవులు ఎంత గొప్ప ఆధ్యాత్మికతను పొదిగారో, ప్రేయసిని ప్రకృతిలో ఆరోపించి దర్శించి పలవరించే గీతాలలోనూ అంతే తాదాత్మ్యతను ప్రదర్శించారు.

అలాంటి మరిన్ని పాటల గురించి వచ్చే సంచికలో.

(మరికొన్ని పాటలు వచ్చేనెలలో)

Post your comments